## బీఆర్ఎస్ నియోజక వర్గ కోఆర్డినేటర్ల నియామకం

పెద్దపల్లి, ఏప్రిల్16: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్‌కు సంబంధించి నియోజకవర్గ సమన్వయకర్తలను నియమించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ, చెన్నూరుకు మంచిర్యాల జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, బెల్లంపల్లికి పెద్దపల్లి జిల్లా ఓదెల జడ్పీటీసీ గంట రాములు, మంచిర్యాలకు రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, రామగుండంకు టీఎస్ టీఎస్ మాజీ చైర్మన్ సీహెచ్ రాకేశ్ కుమార్, మంథనికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఓరుగంటి రమణారావు, పెద్దపల్లికి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, ధర్మపురికి పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్‌ను నియమించారు.

## ఓదెలలో ఆర్వోబీ నిర్మాణానికి సర్వే

ఓదెల, ఏప్రిల్ 16: మండల కేంద్రంలో ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణానికి అధికారుల బృందం మంగళవారం సర్వే జరిపారు. రైల్వే మూడో లైన్ పూర్తయిన తర్వాత కాజీపేట– బల్లార్ష సెక్షన్ లో రైళ్ల రవాణా పెరిగింది. దీంతో రైల్వే గేట్‌ల వద్ద వాహనదారులు, రైతులు చాలా సేపు ఉండాల్సి వస్తుంది. దీంతో ఇక్కడ రైల్వే గేట్ ఎత్తివేసి ఆర్వోబీ నిర్మాణం చేపట్టడానికి రైల్వే శాఖ భూమి సేకరణతో పాటు మట్టి నమూనాలను జర పనుంది. మంగళవారం రైల్వే, ఎస్సారెస్పీ, ఆర్అండ్‌బీ అధికారుల బృందం ఓదెలలో పర్యటించి సర్వే జరిపారు. త్వరలోనే సర్వే నివేదికలను రైల్వే శాఖకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సారెస్పీ ఈఈ ప్రసాద్, డీఈ కుమార్, ఏఈఈ రాజేశ్, శివరావు, ఏఎక్స్ఈఎన్ సోమరాజు, ఎస్ఎస్‌సీఈ కిషోర్, ఆర్అండ్‌బీ ఏఈఈ సజ్జత్‌పాషా తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

## పని వేళలు మార్చండి

గోదావరిఖని, ఏప్రిల్16: పెరిగిన ఎండ తీవ్రత దృష్ట్యా సింగరేణి ఓసీపీలలో పని వేళలను మార్చాలని టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 44 డిగ్రీలకు చేరుకున్నదని క్వారీలో పని చేసే కార్మికులకు సౌకర్యంగా ఉండేలా మధ్యాహ్న సమయంలో ఏసీ రెస్ట్ షెల్టర్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎండ నుంచి ఉపశమనం కలిగేలా మజ్జిగ ప్యాకెట్లను అందివ్వాలని కోరారు. కార్మికులకు మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ హాస్పిటల్ పంపించే వారిని రిఫరల్ పేరుతో గుర్తింపు పత్రాలు కావాలని తిప్పుకోవడం మానుకోవాలన్నారు. ఈనెల 24న గోదావరిఖనిలో జరిగే జనరల్ బాడీ సమావేశంలో దాదాపు 500 మంది ప్రతినిధులు, 11 డివిజన్ల నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. నూనె కొమురయ్య,మాదాసి రామ్మూర్తి, వడ్డెపల్లి శంకర్, శేషగిరి, పొలాడి శ్రీనివాస రావు, అంజయ్య, సురేందర్, మల్లేశ్, తిరుపతి, రాజ్ కుమార్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి తదితరులున్నారు.

## నిర్లక్ష్యం తగదు

**'నమస్తే' ఎఫెక్ట్**

ముత్తారం, ఏప్రిల్ 16: ఇదేం పాలన.. పల్లెల్లో పడకేసిన పారిశుద్యం పేరిట నమస్తే తెలంగాణ లో ప్రచురితమైన కథనానికి డీపీవో ఆశాలత స్పందించారు. పారుపల్లి, ఓడేడ్ గ్రామాలను ఆమె సందర్శించారు. పారిశుద్ధ్య పనులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. మురుగు కాలువల్లో పూడిక ఎప్పటికప్పుడు తీసి, మురుగు నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓడేడు గ్రామంలోని నర్సరీ, ప్రభుత్వ పాఠశాల, సెగ్రిగేషన్ షెడ్, శ్మశాన వాటికను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇక్కడ ఎంపిఓ వేణు మాధవ్, కార్యదర్శి స్వప్న, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

- పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, సీపీ శ్రీనివాస్

పెద్దపల్లి, ఏప్రిల్16: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్, పెద్దపల్లి డీసీపీ ఎం చేతనతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ గేట్ నుంచి రిటర్నింగ్ అధికారి చాంబర్ వరకు కల్పించాల్సిన భద్రతను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. అంతకు ముందు తన చాంబర్‌లో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై సీపీ, డీసీపీతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18 నుంచి 25 వరకు ఉంటుందన్నారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు.

### మూడంచెల పటిష్ట బందోబస్తు..

నామినేషన్ స్వీకరణ ప్రక్రియ జరిగే సమీకృత కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ తెలిపారు. మొదటి దశలో కలెక్టరేట్ గేటు వద్ద పోలీస్ అధికారులు, రెండో దశలో ఆర్మ్ ఫోర్స్, మూడో దశలో రిటర్నింగ్ అధికారి చాంబర్ వద్ద పారా మిలటరీ ఫోర్స్‌తో మూడంచెల చెల భద్రత ఉంటుందని వెల్లడించారు. నామినేషన్ వేసే సమయంలో ర్యాలీ నిర్వహించే అభ్యర్థులు ముందస్తుగా సువిధా యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంతో ర్యాలీలకు అనుమతి ఇచ్చి, అవసరమైన భద్రత కల్పిస్తామని తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ వేర్వేరు పాయింట్లు ఏర్పాటు చేశామని, ఎగ్జిట్ పాయింట్ వద్ద వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, పెద్దపల్లి సీఐ కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మణ్ రావు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

జ్యోతినగర్(రామగుండం), ఏప్రిల్ 16: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. మంగళవారం రామగుండంలోని ఒకటో డివిజన్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. కొప్పుల ఈశ్వర్ గెలుపుపై సమీక్షించారు. ప్రజాదరణ కలిగిన ఈశ్వరన్నను భారీ మోజారిటీతో గెలిపించాలన్నారు. ఇక్కడ డివిజన్ కార్పొరేటర్ ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ కార్పొరేషన్ కో ఆర్డినేటర్ నారాయణదాస్ మారుతి, పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, నాయకులు ధర్మాజీ కృష్ణ, శివరాత్రి గంగాధర్, మాడిశెట్టి రవి, ఎండి అత్తరుద్దీన్, అసాది వేణుగోపాల్, కత్తె రమల్ల నర్సింగ్, పల్లికొండ నరేశ్, దాముఖ వంశీ, అనిల్, మొండి, కొమురయ్య, పద్మయ్య, అంజి, సురేశ్, గంగాధర్, గణేశ్, వినోద్, రవి, భీమ్రాజ్, సలావుద్దీన్, రాజయ్య, తదితరులు ఉన్నారు.

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పెద్దపల్లి, ఏప్రిల్16: పెద్దపల్లి పట్టణంలో తాగునీరు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా పట్టణంలోని వివిధ వార్డులలో మంచినీటి ఎద్దడి, ఇతర సమస్యల ( శానిటేషన్, ఎలక్ట్రికల్ )పై సెల్ నెంబర్ 63031 27484కు కాల్ చేసి మీ సమస్యలను తెలియజేసి, పరిష్కరించుకోవాలని కమిషనర్ కోరారు.

# వచ్చేనెల 15లోగా పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ • 25 శాతం నిధులు ముందస్తుగా మంజూరు

పెద్దపల్లి, ఏప్రిల్16: పాఠశాల అభివృద్ధి పనుల ప్రతిపాదనలను అమ్మ ఆదర్శ కమిటీలు త్వరితగతిన రూపొందించి పనులను వచ్చే నెల 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ జేఅరుణశ్రీతో కలిసి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధి పనులపై మండల సమాఖ్య సంఘాలు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని 516 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిలో ఇప్పటి వరకు 182 పాఠశాలల్లో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు మాత్రమే సిద్ధం చేశారని, చేపట్టాల్సిన పనులను గుర్తించి వెంటనే వాటి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం రూపొందించిన ప్రతిపాదనలో 25 శాతం నిధులు ముందస్తుగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరు చేస్తామని చెప్పారు. నిధులకు ఇబ్బంది లేదని, పాఠశాల అభివృద్ధి పనులు అత్యంత ప్రాధాన్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి పాఠశాల వద్ద రూ. 25 వేల ఎమర్జెన్సీ ఫండ్ ఉంటుందని, వీటిని అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల తీర్మానంచే వినియోగించుకోవచ్చని, ఎటువంటి ప్రతిపాదనలు, రికార్డులు అవసరం లేదని స్పష్టం చేశారు. మండల సమాఖ్య సంఘం ఆ మండల పరిధిలో ఉన్న పాఠశాలల అభివృద్ధి పనులపై రివ్యూ నిర్వహించాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పిస్తున్నామని, పాఠశాలలు పున: ప్రారంభానికి ముందే తప్పనిసరిగా బాలికల టాయిలెట్లు, బాలుర టాయిలెట్లు, తాగు నీటి సరఫరా, తరగతి గదిల్లోని మైనర్ రిపేర్ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాల కంటే నైపుణ్యం అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారని, ప్రభుత్వం కూడా ప్రైవేట్‌కు దీటుగా వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, డీఈవో డీ. మాధవి, డీఆర్డీవో రవీందర్, పీఆర్ ఈఈ, జిల్లా మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ సరస్వతి, మండల సమాఖ్య,మహిళా సంఘ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు

సుల్తానాబాద్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 16 : ఓటు హక్కు రాజ్యాంగ కల్పించిన హక్కు అని, ఎన్నికలోల స్వచ్ఛందంగా ఓటు వేయాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో భాగంగా స్వీప్ ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుల్తానాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. వయోజనులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్డీవో గంగయ్య జెండా ఉపి ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యాదర్శన్‌రావు, సీఐ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఎఎన్ఏంలు, ఆశా వర్కర్లు, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

**ఓటు వినియోగించుకోవాలి**

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్16: వయోజనులు పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ జాహెద్‌పాషా కోరారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై కాల్వశ్రీరాంపూర్‌లో మంగళవారం బీఎల్‌వోలు, ఆయా శాఖల సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ నాయబ్ తహసీల్దార్ దీరజ్‌కుమార్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు, ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**ఓటు హక్కుపై అవగాహన**

జూలపల్లి, ఏప్రిల్ 16 : వడ్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు కలిసి మంగళవారం ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ తీశారు. ప్రతి ఒక్కరూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సూచించారు. ఇక్కడ తహసీల్దార్ బషీరొద్దీన్, ఎంపీవో కిరణ్, హెచ్ఎం దూస రమేశ్, ఆర్ఐ ప్రవంతి, బీఎల్‌వోలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు వెడల్పును కుదించిన కాంట్రాక్టర్

**నిర్మాణ పనులను వ్యతిరేకించిన బీఆర్ఎస్ కార్పొరేటర్**

జ్యోతినగర్(రామగుండం), ఏప్రిల్ 16: రామగుండం 20వ డివిజన్ మల్యాలపల్లిలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన తారురోడ్డు నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు వెడల్పును కుదించినట్లు డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ తెలిపారు. సోమవారం రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ 3.75 మీటర్ల వెడల్పుతో రెండు కిలో మీటర్లు వేయాల్సిన రోడ్డును 3 మీటర్ల వెడల్పుతో చేపడుతున్న నిర్మాణ పనులను వ్యతిరేకించి కాంట్రాక్టర్‌ను ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. రామగుండం పట్టణ ప్రజలు నిత్యం జిల్లా కేంద్రం పెద్దపల్లికి ప్రయాణించే ఈ రోడ్డు కోసం పలు దఫాలుగా ఆందోళనతో మంజూరు కాగా డబుల్ లేయర్‌తో వేయాల్సిన రోడ్డును సింగిల్ లేయర్‌తో వెడల్పును తగ్గించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతం అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ విషయమై ఎన్టీపీసీ అధికారులు వెంటనే స్పందించి 3.75 మీటర్ల వెడల్పుతో పనులు జరిగేలా చూడాలన్నారు. లేనియెడల ప్రజా ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

## చీమలపేటలో ఇద్దరికి డెంగీ

జూలపల్లి, ఏప్రిల్ 16 : మండలంలోని చీమలపేటకు చెందిన ఇద్దరికి డెంగీ సోకింది. ఏగుర్ల గట్టయ్య, ఏగుర్ల రాజు డెంగీ బారిన పడి కొద్ది రోజులుగా కరీంనగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జూలపల్లి పీహెచ్‌సీ బృందం వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. డాక్టర్ సంపత్‌రెడ్డి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య బృందం ఇంటింటా పర్యటించి పరిశుభ్రత, వ్యాధుల నివారణపై సూచనలు ఇచ్చారు. ఎస్‌యూవో అంజయ్య శిబిరాన్ని సందర్శించి వ్యాధుల నిర్మూలన, జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇక్కడ ఎంపీవో కిరణ్, కార్యదర్శి సంధ్యారాణి పాల్గొన్నారు.

## ఇద్లాపూర్ లో వైద్య శిబిరం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్16: మండలంలోని ఇద్లాపూర్ లో కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ దవాఖాన వైద్య బృందం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 13 మందికి వివిధ రకాలు పరీక్షలు నిర్వహించారు. ఏడగురి రక్త నమూనాలను సేకరించి లాబ్ కు పంపించినట్లు ప్రభుత్వ వైద్యాధికారి మహేందర్ తెలిపారు. రెండు రోజులుగా ఎండ తీవ్రత ఉన్నందున వ్యవసాయ పనులకు వెళ్లే వారు తప్పనిసరిగా ఉదయం 10 గంటల వరకే ఇంటికి చేరుకోవాల సూచించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలనారు. ఇక్కడ ఎంపీవోగోవర్ధన్, డాక్టర్ భావన, హెచ్ఈవో ఆరెపల్లి లక్ష్మణ్, ఏఎన్ఎం కవిత, ఆశ కార్యకర్త జ్యోతి , సిబ్బంది ఉన్నారు.

## ఎన్టీపీసీలో సీఐఎస్ఎఫ్ ఐజీ పర్యటన

జ్యోతినగర్, ఏప్రిల్ 16: హైదరాబాద్ సౌత్‌జోన్–2 సీఐఎస్ఎఫ్ ఐజీ నంద మంగళవారం రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ప్రాజెక్టులో విస్తృతంగా పర్యటించారు. సీఐఎస్ఎఫ్ భద్రత చర్యలను పరిశీలించిన ఆయన సీఐఎస్ఎఫ్ గార్డు డ్యూటీ విధుల ప్రదేశాలను సందర్శించారు. అనంతరం ఎన్టీపీసీ సీఎస్ఎఫ్ బ్యారక్ సందర్శనతో బ్యారక్‌లో దర్బార్ నిర్వహించి సీఐఎస్ఎఫ్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా బ్యారక్‌లో ఐజీ సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఐజీ వెంట ఇక్కడి ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ ముఖేశ్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ నైనేశ్ కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ ఎన్ సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.

## యువతి పెళ్లికి వంట పాత్రలు అందజేత

కమాన్‌పూర్, ఏప్రిల్ 16: మండల కేంద్రానికి చెందిన సానియా వివాహానికి రిటైర్డ్ సీఐ అలీ తన ట్రస్టు తరపున చేయూతనందించారు. యువతి తల్లికి మంగళవారం వంటపాత్రలు అందజేశారు. ఈనెల 21న వివాహం నిశ్చయం కాగా, ఉమ్మడి కరీంనగర్ మైనార్టీ పోలీస్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం యువతుల వివాహాలకు సాయం అందిస్తున్నారు. రిటైర్డు సీఐ అలీని సంప్రదించగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో వధువుకు వంట పాత్రలు పంపించారు. జబ్బార్ ఖాన్, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సతీశ్, ఎంఏ రఫీ, షౌకత్ ఖాన్ అందజేశారు.

## నూతన ఆవిష్కరణలవైపు దృష్టి సారించాలి

పెద్దపల్లిరూరల్, ఏప్రిల్16: విద్యార్థులంతా నూతన ఆవిష్కరణలవైపు అడుగులు వేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య అన్నారు. పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం స్పోర్ట్స్, సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు పి నితిన్, రేళ్ల సంజీవ్, రవీందర్‌రావు, రామకృష్ణ, అర్జున్, తిరుపతి, అంజయ్య, సునీత, కిరణ్మయి, మాధవి, రజిత, భానూ, విజయానంద్, సతీశ్, వంశీ పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజమల్లు

రామగిరి, ఏప్రిల్ 16: రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సమాఖ్య సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగెపల్లికి చెందిన గొల్లపల్లి రాజమల్లును నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న ఉత్తర్వులు జారీ చేశారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని రాజమల్లు తెలిపారు.

## నీటి కొరత లేకుండా జాగ్రత్త వహించండి

కోల్‌సిటీ, ఏప్రిల్ 16: వేసవిలో నగరంలో నీటి కొరత లేకుండా చూడాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ ఆదేశించారు. మంగళవారం రామగుండం నగరంలో పర్యటించి శారదానగర్‌లోని నగర పాలక సంస్థ ఉపరితల జలాశయం, సింగరేణి ఫిల్టర్ బెడ్‌లను సందర్శించారు. అనంతరం బల్దియా, సింగరేణి అధికారులతో నీటి సరఫరా స్థితిని సమీక్షించారు. ప్రస్తుతం నగరంలో నీటి సరఫరాకు ఏలాంటి ఇబ్బందులు లేవని కమిషనర్ శ్రీకాంత్ వివరించారు. ఇక్కడ ఎస్ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్, డీఈఈ జమీల్, సింగరేణి అధికారి యుగంధర్ రెడ్డి ఉన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పెద్దపల్లిరూరల్, ఏప్రిల్16: మండలంలోని పెద్ద బొంకూర్‌లో ఇప్పటికే చెడిపోయిన బోర్‌వెల్‌లను మరమ్మతు చేయిస్తున్నట్లు పెద్దపల్లి ఎంపీవో సుదర్శన్ అన్నారు. అన్ని బోర్‌వెల్ పంపుల్లో నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వెంట పంచాయతీ కార్యదర్శి స్వప్న, సిబ్బంది ఉన్నారు.

## సన్మానం

పెద్దపల్లిరూరల్, ఏప్రిల్16: పెద్దపల్లి మండలం చీకురాయి నుంచి ఫుడ్ కర్పోరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్‌లెవెల్ కన్సల్టివ్ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన మేకల శ్రీనివాస్ యాదవ్‌ను బిజేపి రాష్ట్ర నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ యాదవ్‌ను రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కాపం వెంకటేశ్వర్లు యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి రావుల రాజేందర్ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## సాగు పద్ధతులపై అవగాహన

కమాన్‌పూర్,ఏప్రిల్ 16: వ్యవసాయ రంగంలో ఆధునిక సాగు పద్ధతులపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండారం రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సహాయ సంచాలకులు జక్కుల కాంతారావు హాజరయ్యారు. కాగా, వీడియో కాన్ఫరెన్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు నూతన సాగు పద్ధతుల గురించి వివరించారు. నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెంపొందించే విధానంపై ప్రముఖ శాస్త్రవేత్త డా.ఉమారెడ్డి వివరించారు. వరి కొయ్యలను కాల్చివేయకుండా భూమిలో కలియదున్నడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ నీరు... జనం బేజారు

- 12వ డివిజన్‌లో వారం నుంచి అదే తాగునీరు

కలుషిత నీటిని చూపిస్తున్న కార్పొరేటర్

కోల్‌సిటీ, ఏప్రిల్ 16: అసలే వేసవి కాలం... ఆపై తాగునీటి ఎద్దడి. ముందు చూపు లేని నగర పాలక అధికార యంత్రాంగం. కానీ, 12వ డివిజన్ ప్రజలకు మాత్రం డ్రైనేజీ నీరే ఆఖరికి తాగు నీరుగా వాడుకుంటున్న దుస్థితి ఇది. రామగుండం నగర పాలక సంస్థ 12వ డివిజన్ ఫైవింక్లయిన్ ఏరియాలో మిషన్ భగీరథ మంచినీటి కుళాయిల నుంచి డ్రైనేజీ నీరు వస్తుండడంతో డివిజన్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారం నుంచి దుర్వాసనతో కూడిన డ్రైనేజీ నీరు నల్లాల ద్వారా వస్తున్నది. గమనించిన డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ నగర పాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా సమస్యను పరిష్కరించడం లేదని వాపో యారు. కాగా మంగళవారం సాయంత్రం కూడా డివిజన్‌లో తాగు నీరు సరఫరా అయ్యే ఇంటింటికి వెళ్లి మంచినీటి కొళాయిల నుంచి వస్తున్న భగీరథ నీటిని ఆమె పరిశీలించారు. డివిజన్‌లో ఎక్కడో పైపులైను లీకేజీ అయి డ్రైనేజీ నీరు అందులో కలిసివస్తుందని, డివిజన్ ప్రజలు దిక్కులేక ఈ కలుషిత నీటినే వారం రోజులుగా వాడుకుంటు న్నామని ఆమె దృష్టికి తీసుకవచ్చారు. ఈవిషయమై బల్దియా అధికారులకు చెప్పిన కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనీ, కంపుకొడుతున్న డ్రైనేజీ నీటిని మంచినీటిగా వాడుకోవాల్సిన దుస్థితి నెలకొందని, డివిజన్ ప్రజలు అనారోగ్యాల బారిన పడితే అందుకు అధికారులే బాధ్యత వహించాలని తెలిపారు. సమస్యను పరిష్కరించి శుద్ధమైన మిషన్ భగీరథ నీటి సర